క్లుప్తంగా

వెల్గటూర్ ఠాణా తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటస్వామి

వెల్గటూర్: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ వెంకటస్వామి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ రమణమూర్తి, ఎస్సై శ్వేత తదితరులు పాల్గొన్నారు.

భారీ ఇసుక డంపు పట్టివేత



ఇసుకను పరిశీలిస్తున్న అధికారులు

కోరుట్ల రూరల్: మండలంలోని నాగులపేట శివారులో భారీ ఇసుక డంపును మైనింగ్ ఆర్‌ఐ నిర్మల గురువారం పట్టుకున్నారు. అక్రమంగా నిల్వ చేసిన 1,568 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జగిత్యాల తరలిస్తున్నామని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్..

ఇబ్రహీంపట్నం: గోదావరి నుంచి గురువారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కోమటి కొండాపూర్ శివారులో పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఉమాసాగర్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సూపర్ మార్కెట్ ప్రారంభం



మార్కెట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్: పట్టణంలో ఏర్పాటు చేసిన సహారా సూపర్ మార్కెట్‌ను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. వ్యాపారంలో మనోధైర్యంతో ముందుకుసాగాలని నిర్వాహకుడు ఖలీల్‌కు సూచించారు. నాయకులు మున్ను, మొబిన్, షాకీర్, ముజఫర్, శంషేర్ తదితరులు పాల్గొన్నారు.

యాచకులకు దుప్పట్ల పంపిణీ



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని సుమారు 100 మంది యాచకులకు సామాజిక సేవకుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగుల కిషన్‌గౌడ్, కళాశ్రీ అధినేత గుండేటి రాజు, ఎలగందుల రవి పాల్గొన్నారు.

నేడు జగిత్యాల రూరల్ సర్వసభ్య సమావేశం

జగిత్యాలరూరల్: మండల సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇన్‌చార్జి ఎంపీపీ పాలెపు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వరి తెలిపారు. అన్ని శాఖల అధికారులు, అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రేపు మల్లాపూర్‌లో..

మల్లాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ కాటిపెల్లి సరోజన అధ్యక్షతన మల్లాపూర్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజశ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ హాజరవుతున్నారని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో రావాలని సూచించారు.

సామాజిక కార్యకర్తలకు సన్మానం

మల్లాపూర్: గొర్రెపల్లిలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇద్దరు సామాజిక కార్యకర్తలను సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్ మాట్లాడుతూ.. గొర్రెపల్లికి చెందిన కొడిమ్యాల రాజేందర్, చెదలు హరీశ్‌లు సొంతంగా మల్లాపూర్–గొర్రెపల్లి 61వ జాతీయ రహదారితోపాటు గ్రామంలోని అంతర్గత రోడ్లకు ఇరువైపులా మొరం పోయించి, చదును చేయించారని తెలిపారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోండి

కోరుట్లటౌన్: ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె.రాజ్‌కుమార్ తెలిపారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న ఎస్సీ విద్యార్థుల ఆధార్ అథెంటికేషన్ పూర్తి చేసి, ప్రిన్సిపాళ్లు హార్డ్‌కాపీలను కార్యాలయంలో అందించాలని సూచించారు.

శ్మశానవాటికలో నీటికి పాట్లు



వైకుంఠధామంలో బిరడాలు లేని నల్లాలు



గార్డెన్ ఏర్పాటు చేయాల్సిన స్థలం

- బోర్‌వెల్ లేదు, నల్లాలకు బిరడాలు లేవు
- సమయానికి అందని పైపులైన్ నీరు
- మున్సిపల్ ట్యాంకర్‌ను ఆశ్రయిస్తున్న ప్రజలు
- చేసిన పనుల్లోనూ నాణ్యతాలోపం
- రాయికల్ పట్టణంలో పరిస్థితి

రాయికల్: పట్టణ శివారులో ఏర్పాటు చేసిన శ్మశానవాటికలో నీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎవరైనా చనిపోతే దహన సంస్కారాల అనంతరం స్నానం చేసేందుకు మున్సిపల్ ట్యాంకర్‌ను ఆశ్రయిస్తున్నారు.

రూ.కోటి మంజూరు..

రాయికల్ పట్టణంలో వైకుంఠధామం నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. ఈ డబ్బులతో శ్మశానవాటికలో పార్కింగ్ టైల్స్, బోర్‌వెల్, ఓపెన్ షెడ్, శివుని విగ్రహం ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ, కాంట్రాక్టర్ చేయించిన పనుల్లో నాణ్యత లోపించడంతో గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. పనులు నత్తనడకన సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అవసరమైనప్పుడు రావట్లేదు..

దహన సంస్కారాల తర్వాత స్నానాల కోసం రాయికల్ పట్టణంలోని ఓ బావి వద్ద నుంచి తాత్కాలికంగా పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. కానీ, ఆ నీరు చాలా ఆలస్యంగా వస్తుండటంతో ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో మున్సిపల్ ట్యాంకర్‌ను ఆశ్రయిస్తున్నారు. అవసరమైనప్పుడు నీరు లేకపోవడం, పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే సమయంలో శ్మశానవాటికలో ట్యాంకర్ నిండి, నల్లాలకు బిరడాలు బిగించకపోవడంతో వృథాగా పోతోంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ హన్మాండ్లు, కమిషనర్ సంతోష్‌కుమార్ స్పందించి, శ్మశానవాటికలో బోర్‌వెల్ వేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నరు



శ్మశానవాటికలో నీరు లేకపోవడంతో దహన సంస్కారాల తర్వాత స్నానాలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నరు. ఎవరైనా చనిపోతే గంటముందు మున్సిపల్ అధికారులకు లేదా ట్యాంకర్ కోసం సమాచారం ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది.

– తోపారపు రవి, రాయికల్

బోరు ఏర్పాటు చేస్తాం



రాయికల్ పట్టణంలోని వైకుంఠధామంలో బోరు కోసం రూ.12 లక్షలు మంజూరయ్యాయి. వెంటనే ఏర్పాటు చేసి, నల్లాలకు బిరడాలు బిగించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

– సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

మెట్‌పల్లిలో రూ.3.74 కోట్ల పనులు



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

- రూ.26 వేల రికవరీకి ఆదేశించాం
- సామాజిక తనిఖీ ప్రజావేదికలో డీఆర్‌డీవో నరేశ్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని 23 గ్రామాల్లో రూ.3.74 కోట్ల ఉపాధిహామీ పనులు చేపట్టినట్లు డీఆర్‌డీవో నరేశ్ తెలిపారు. గురువారం మెట్‌పల్లి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో 14వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు చేసిన పనులు, వెచ్చించిన నిధుల వివరాలు వెల్లడించారు. రూ.3.41 కోట్లు పనులు చేసిన ఉపాధిహామీ కూలీలకు చెల్లించినట్లు, రూ.33 లక్షలు పలు సామగ్రి కోసం వినియోగించినట్లు గుర్తించారు. మరో వైపు పలువురు పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఓ కంప్యూటర్ ఆపరేటర్ తప్పిదాలు చేసినందుకు రూ.26 వేల రికవరీకి ఆదేశించామన్నారు. కార్యక్రమంలో డీవీవో చిన్నయ్య, ఏపీవో దేవేందర్, అంబుడ్స్ పర్సన్ కృష్ణారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి రాజేంద్రప్రసాద్, ఎంపీపీ సాయిరెడ్డి, ఎంపీడీవో భీమేశ్, ఎంపీవో, ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రైతులు

సాక్షి స్పందన

ఇబ్రహీంపట్నం: మండలంలో భూ రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో నిలిచిన రిజిస్ట్రేషన్లు అనే శీర్షికన గురువారం 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ ప్రసాద్‌కు రిజిస్ట్రేషన్లు చేసేందుకు లాగిన్ ఇవ్వడంతో సదరు ప్రక్రియ ప్రారంభమైంది. 30 మంది రైతులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉండటంతో తహసీల్దార్ పూర్తి చేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మహిళా సభ్యులు

మల్యాల: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంపై మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మల్యాల సెర్ప్ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు అంజలి, సుజాత, రజని, శ్యామల, పుష్పలత, సుమలత, లక్షిత, సాత్విక, సరిత తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన విద్యార్థులు



మిరపతోట గురించి వివరిస్తున్న టీచర్లు

కథలాపూర్: సిరికొండ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు గురువారం వివిధ రకాల పంటలను పరిశీలించారు. పాఠ్యాంశాల్లో నేర్చుకున్న వాటిని పిల్లలకు క్షేత్రస్థాయిలో వివరిస్తే అవగాహన ఉంటుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. గ్రామ శివారులో మిరప, పసుపు, వరి, కూరగాయల తోటల్లోకి విద్యార్థులను తీసుకెళ్లి, వాటి గురించి వివరించినట్లు తెలిపారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు మమత, దేవయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి



మల్యాల: నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మల్యాల: మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీసు ఎదుట గ్రామీణ తపాల ఉద్యోగులు గురువారం నిరసన తెలిపారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మూడు రోజులుగా సమ్మె చేస్తుండటంతో ఉత్తర ప్రత్యుత్తరాలు నిలిచిపోయాయి. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం సివిల్ సర్వెంట్ హోదా కల్పించి, సీనియారిటీ ప్రాతిపదికన ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. టార్గెట్ల పేరుతో వేధించొద్దని డిమాండ్ చేశారు. వారికి మాజీ ఎంపీపీ ఆదిరెడ్డి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఎండీ.చందు, బొజ్జ నర్సయ్య, శ్రీనివాస్, భాస్కర్, సర్వర్, వాసుకృష్ణ, నవీన్, బాల మురళి, ఆలెందర్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని తపాలా ఉద్యోగులు స్థానిక పోస్టాఫీసు ఎదుట గురువారం నిరసన తెలిపారు. 7వ వేతన సవరణ చట్టంలో ఇచ్చిన హామీలు, ఇంక్రిమెంట్లు అమలుకు నోచుకోలేదన్నారు. రిటైర్మెంట్ సమయంలో రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు చెంగలి గంగాధర్, పోతవేని లింగం, శంకర్, విక్రమ్‌నాయక్, చక్రపాణి, వనిత, రాణి, బుచ్చన్న, రమేశ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, షీ టీంలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నవీన్‌కుమార్

మల్లాపూర్: యువత, విద్యార్థులు వ్యసనాలకు బానిసలవ్వొద్దని మెట్‌పల్లి ఎస్‌ఐ నవీన్‌కుమార్ అన్నారు. గురువారం మల్లాపూర్ మండలంలోని సాతారం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, షీ టీంలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు తీసుకురావాలని సూచించారు. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా మోసపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు గున్నాల శ్రీనివాస్, హెచ్‌ఎం శ్రీహరి, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ లత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులకు వచ్చేలా ప్రోత్సహించాలి



కథలాపూర్: ఉపాధిహామీ పథకంలో చేపట్టే పనులకు కూలీలు అధిక సంఖ్యలో వచ్చేలా ప్రోత్సహించాలని ఎంపీడీవో జనార్దన్ అన్నారు. గురువారం కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వన నర్సరీ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతీ గ్రామంలో 50 మందికి పైగా కూలీలు హాజరయ్యేలా చూడాలని, పని ప్రదేశంలో వసతులు కల్పించాలన్నారు. ఏపీవో రాజేందర్, టీఏలు శ్రీధర్, అంబాజీ పాల్గొన్నారు.

రక్షణ లేకుండా గ్రానైట్ తరలింపు



పెగడపల్లి: బతికపల్లి బండరాయి గుట్ట నుంచి తరలిస్తున్న గ్రానైటు రాళ్లతో ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే పెగడపల్లి మండల కేంద్రం నుంచి పెద్ద గ్రానైట్ రాళ్లను కరీంనగర్‌కు లారీల్లో తరలిస్తున్నారని తెలిపారు. ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదని, అవి కిందపడి, అనుకోని ప్రమాదం జరిగితే బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు. రాళ్లకు కవర్లు కప్పి, తాళ్లతో బిగించాల్సి ఉండగా నిర్వాహకులు అవేమీ పట్టించుకోవడం లేదని అంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వరుస సైకిల్ దొంగతనాలు



సైకిల్ ఎత్తుకెళ్తున్న దొంగ (సీసీ ఫుటేజీ)

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా వరుస సైకిల్ దొంగతనాలు జరుగుతున్నాయి. ఇంటి ముందు నిలిపిన సైకిళ్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్తున్నారు. గురువారం జగిత్యాల పట్టణంలోని ఉస్మాన్‌పుర ప్రాంతంలో ఒకే గంటలో రెండు సైకిళ్లను చోరీ చేయగా, సంబంధిత దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డయ్యాయి. దీంతో సైకిళ్లు, ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయాలంటేనే ప్రజలు జంకుతున్నారు.

మంత్రిని కలిసిన బీసీ నాయకులు



మంత్రి ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను జగిత్యాల బీసీ సంక్షేమ సంఘం నాయకులు గురువారం కరీంనగర్‌లో కలిసి, సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు చొరవ చూపాలన్నారు. కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జనగణనలో బీసీ కుల గణన చేయాలని కోరారు. అద్దె భవనాల్లో నడుస్తున్న బీసీ వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా యువతకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. నాయకులు ముసిపట్ల లక్ష్మీనారాయణ, అలిశెట్టి ఈశ్వరయ్య, తిరుపురం రాంచందర్, జాజాల రమేశ్, బండారి వెంకటేశ్వర్లు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి



మాట్లాడుతున్న శ్రావణి

సారంగాపూర్: వచ్చే పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేందుకు కష్టపడి పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. గురువారం సారంగాపూర్ మండల కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో పని చేయాలని సూచించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్, నాయకులు గంగరాజం, ప్రమోద్, వెంకటేశ్, జమున, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు ఆర్థికసాయం



నగదు అందిస్తున్న మోడల్ స్కూల్ అధ్యాపకులు



డబ్బులు ఇచ్చిన రాజేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: మండల కేంద్రంలోని గల్ఫ్ బాధిత కుటుంబానికి గురువారం మల్లాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ.అలీమొద్దీన్ ఆధ్వర్యంలో అధ్యాపకులు ఆర్థికసాయం అందించారు. మల్లాపూర్‌కు చెందిన గొట్టిపడుత రాజు ముగ్గురు పిల్లలు తమ స్కూల్లోనే చదువుతున్నట్లు తెలిపారు. అతను ఉపాధి కోసం సౌదీ వెళ్లి, పక్షవాతానికి గురయ్యాడని అన్నారు. బాధిత కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకొని, రూ.21 వేలు అందించినట్లు పేర్కొన్నారు. అధ్యాపకులు లచ్చిరాం నాయక్, నరేశ్, మురళి, సురేందర్, హేమంత్, భాగ్యలక్ష్మి, నవీన్, సాయిచందర్, సందీప్, రాధిక, నవీన్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, మహేశ్, నరేందర్, మల్లేశం పాల్గొన్నారు.

వేంపేటలో..

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని వేంపేటకు చెందిన నాయిని కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి సింగిల్‌విండో డైరెక్టర్ కొమ్ముల రాజేశ్వర్‌రెడ్డి గురువారం రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. ఉపసర్పంచ్ ప్రవీణ్, శంకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సుకుమార్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో..

మేడిపల్లికి చెందిన పురాణం రంజిత్ అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వీరిది పేద కుటుంబం కావడంతో జగిత్యాల జిల్లా సహాయక బృందం సభ్యులు గురువారం 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.1,000 అందజేశారు. సర్పంచ్ తిరుపతిరెడ్డి, బృందం సభ్యులు రాము, రాజశేఖర్, హరీశ్, గౌతం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రావుపేటలో..

మేడిపల్లి: భీమారం మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన సురకంటి నారాయణ అనారోగ్యంతో మృతిచెందారు. నిరుపేద కుటుంబం కావడంతో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ యువసేన సభ్యులు గురువారం 50 కిలోల బియ్యం , నిత్యావసర సరుకులు అందించారు.

బుగ్గారం జీపీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు



ఫిర్యాదు పత్రాలను చూపుతున్న గంగారెడ్డి

బుగ్గారం: బుగ్గారం గ్రామ పంచాయతీలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని స్థానిక వీడీసీ నాయకుడు చుక్క గంగారెడ్డి ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యాయపోరాటం చేస్తున్న ఆయన గురువారం విజిలెన్స్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రూ.కోటికి పైగా నిధుల దుర్వినియోగం జరిగితే జిల్లా అధికారులు నామమాత్రపు విచారణ జరిపి, కేవలం రూ.4 లక్షలు రికవరీ చేశారని పేర్కొన్నారు. అలాగే, పలు ఆర్టీఐ దరఖాస్తులకు తగిన సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఈ మేరకు విజిలెన్స్ విభాగ డైరెక్టర్ జనరల్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయ ద్వార ప్రతిష్ఠ

సారంగాపూర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో పురాతన ఆంజనేయ స్వామి ఆలయాన్ని తిరిగి నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఆలయ ద్వార ప్రతిష్ఠ నిర్వహించారు. కార్య క్రమంలో గంగాధర్, నరసింహారెడ్డి, ముత్యాలు, రమేశ్, రంజిత్, రాజు, గంగాధర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్.. బైకులకు 'పార్కింగ్'



మల్యాల: మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన మల్యాల బస్ షెల్టర్ ఇప్పుడు బైకులకు పార్కింగ్ స్థలమైంది. బస్సులను రోడ్డుపైనే నిలుపుతుండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి, బస్ షెల్టర్‌లో ప్రయాణికులు కూర్చునేలా, బస్సులు లోపలికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.